# దేవతలు



అబ్బునాథం జుట్టు పీక్కోడానికి, నిద్రపోవడానికి, లీటర్లకొద్దీ కాఫీ తాగడానికి, అస్ప్రోమాత్తర్లు మింగడానికి, 'పార్కుల్లోనూ, కాలవగట్లమీదా రకరకాల భంగిమల్లో కూచునీ, నుంచునీ, పడుకునీ ఆలోచించడానికీ, కాలుగాలిన పిల్లిలా ఊరంతా తిరగడానికీ, టిక్కట్లు కొనుక్కుని కె వి. రెడ్డిగారి తెలుగుసినిమా కెళ్ళినా కథ అర్థంకాకపోవడానికీ, బిస్మిల్లా ఖాన్ షహనాయి కూడా గంగిరెద్దు మేళంలా వినబడ్డానికీ ఓ ముఖ్యకారణం అతన్ని పీడిస్తున్న చిన్న సమస్య. ఈ సమస్యక్కారణం అతని భార్య సుజాత మూడు రోజులనుంచీ అన్నం అద్భుతంగా వండగలగడం. అలా వండగలగడానిక్కారణం బియ్యంలో వడ్లూ, బెడ్డలూ, రాళ్ళూ పూర్తిగా ఏరేసి మింగెయ్యగలగడం. అదీగాకుండా తెల్లారుఝాము అయిదు గంటలకే అలారం పెట్టుకు మరీ లేచి భళ్ళుభళ్ళున డోక్కుంటూ చుట్టుపక్కల అమ్మలక్కల్ని చుట్టూ పోగేసుకోడం. వాళ్ళందరూ కలిసి ఏకకంఠంతో "నెల తప్పింది" అని తేల్చెయ్యడం. దాంతో అబ్బునాథానికి ఒళ్ళు మండిపోవడం. ఓ బామ్మగార్నినిలేసి "కాపురానికొచ్చిన ఈ ఆరేళ్ళనుంచీ మా యావిణ్ణిచూస్తూనే ఉన్నారుగదా! గభాల్న పొద్దున్నే లేచొచ్చి ఇంతమాటనడానికి మీ బోసినోరెలా వచ్చింది?" అనడిగెయ్యడం. చిరునవ్వు లొలకబోసిన బామ్మగారు "ఆడదాని సంగతి నీకేం తెలుసు నాయనా? అడంతే!" అనడం. తన నమ్మకానికి బలం ఇస్తుందిగదాని ఓ లేడీడాక్టర్ని మైలుదూరంనుంచి పిల్చుకొస్తే, ఆవిడకూడా ఇకిలించి, బామ్మగారి పక్షమైపోవడమే కాకుండా విటమిన్ "ఇ" మాత్తర్లూ, బీ కాంప్లెక్సు పానకమూ, మరో ఇంజక్షనూ రా వ్వడం. అంతలోనే అతనిలో ఏదో విం చైతన్యం కలిగి రొమ్ము విరుచుకు తిర డం. ఆ తిరుగుడు తలలోకి ప్రవేశిం "మంకీషేక్" డాన్సుగా మారడ . డాన్సానందించిన లేడీడాక్టరు పోతూ "అమ్మాయి బలహీనంగావుంది. అ

చాకిరీ చెయ్యనివ్వకండి, వీలుంటే మీరు చేసుకోండి లేదా మీ పెద్దఘటాలేవన్నా వుంటే స్వయంగాగాని, పోస్టుద్వారాగాని, తంతిమూలంగాగాని కేకెయ్యండి" అని సలహా ఇవ్వడం — మనోనేత్రంతో వెదికితే ఆటొచ్చే పెద్ద ఘటాలు ఒకటి "అమ్మ" — రెండోది "అత్త" కనబడ్డం. "వీటిల్లో ఏఘటాన్ని రప్పించాలి?" అని తనను తాను ప్రశ్నించుకోడం.

ఇదిగో ఈప్రశ్నే అతనికి సమస్యయి కూర్చుంది.

అమ్మొస్తే కమ్మగా భోంచెయ్యొచ్చు— నిజమే! కానీ, ఆవిడకా పల్లెటూరునుంచి కాలుకదపడం అంటే గండకత్తెర్లా వుంటుందే! అందులోనూ మద్రాసు రావడమంటే ఆవిడకు మహాచిరాకు. రోడ్లనిండా బస్సులూ, కార్లతో నానా గందరగోళంగా చస్తాయిట. నడుద్దామంటే వీల్లేకుండా! ఏ నిమిషంలో నూరేళ్ళు నిండుతాయో తెలియదుట. కారెక్కితే పెట్రోలు కంపుతో రోగ మొస్తుందంట. కమ్మని వెన్న, నెయ్యిలకు మొహం వాచిపోవాలట. బాపయ్యగారి కోడలు పోసే మజ్జిగలాటి మజ్జిగ దొరకవుట. "ఇంకెల్లా బతకడం? నా పిండాకూడూ" అంటూంటుందెప్పుడూ. ఆవిడకు ఉత్తరంరాసి ఏంప్రయోజనం?

పోనీ రాశాడనుకోండి—"ప్రియమైన తల్లిగారూ! తమరి కోడలు 72 నెలల్లో ఒక్కనెలా తప్పలేదు. ఇదే మొదటి దఫా" అని... ఆవిడేం కోప్పడదు. పైగా మెచ్చుకుంటుందికూడా. సందేహం లేదు. కానీ—రమ్మని ఆహ్వానిస్తే ఆవిడ ఎదురు ఆహ్వానం పంపించొచ్చు "దాన్నే ఇక్కడికి పంపించు. సుబ్బరంగా పురుడోసి పంపిస్తాను. నీకు పురుడోసిన మంత్రసాని 'సీతి' ఇంకా బతికేవుంది. కళ్ళు కనబడకపోయినా పెద్దపెద్దవాళ్ళక్కూడా పురుడు పోస్తోంది. దాని చెయ్యి అత్యుత్తమమైనది" అని.

పోనీ వస్తే—

సుజాతకూ ఆవిడకూ మనసలు కలుస్తాయో లేదో! (పెళ్ళయిన కొత్తలో మూణ్ణిద్దర్లపుడు తప్ప ఇద్దరూ ఎప్పుడూ ఒక్కచోట కలిసి లేంయ్యో) కలవకపోతే మరో సతీసక్కు-

కాయికథ తయారవుతుందేమో! స లతని లెక్కప్రకారం కాఫీతోనే థ ప్రారంభం కావచ్చు. సుజాత సు లేస్తూనే కాఫీకావాలి. స్నానానికి సబ్బులు కావాలి. తర్వాత పౌడరు కావాలి. అమ్మకివేవీ గిట్టవు. మగ తాగమంటుంది. పసుపుకలిపిన సున్ని పిండితో స్నానం చెయ్యమంటుంది. పోతే–ఈ లేడీడాక్టర్లూ, సూదిమందులూ అంటే దుమ్మెత్తిపోస్తుంది. నల్ల ఇంగువ చప్పిడీ, గోరోజనం, కస్తూరి తప్ప చూలింతకు మరో మందు లేదంటుంది. వాటిని సుజాత మర్యాదగా వాడింది సరేసరి... లేకపోతే కాళ్ళమీద పడు పెట్టుకుని, భోషాణం తాళంచెవితో నోరు పగల్దీసి కతేస్తుంది, ఏడు నెలలూ నిండే వరకూ గర్భిణీఅయినా చాకిరీ చెయ్యాలంటుంది. స్వంతకూతుళ్ళే అం చూస్తుంది. సుజాతను మాత్రం కూ పెట్టి మేపుతుందా?

మరలాటప్పుడు సుజాతకు విశ్రాం ముంటుంది?

దీన్నిమించిన ఇబ్బందులు కొన న్నాయి అబ్బునాథానికి.

అదేంఖర్మమో... అతనికి ముప్పం రెండేళ్ళొచ్చినా, ముప్ఫయిరెండు నె చంటికుర్రాణ్ణి చూసినట్టు చూస్తుంది.

చెప్పినట్టు వింటే నెత్తినెక్కించుకుంటుంది. ముద్దెట్టుకుంటుంది. దిబ్బ రొట్టెలూ, తప్పాలాచెక్కలూ కాలి పెడ్తుంది. అన్నంలో పేరిన నెయ్యి నం పెడ్తుంది. శక్తిలేకకానీ చంకనేసుకు "దాయి దాయి" చూపించాలనికూడా వుంటుంది. అడ్డం తిరిగినట్టనిపించిందా ఇహ ముద్దూమురిపెం, మంచీమర్యాద లకు స్వస్తిచెప్పి పదిమందిలోనూ నిల బెట్టి ఓ పదిరూపాయలగడ్డి పెడ్తుంది అబ్బునాథం ఎంతమందిలోఅయినా తల్లి చేత చివాట్లు తినగలడు. కానీ, అర్ధాంగి ముందిలాటి సత్కారం జరిగితే?... అమ్మో! ఇంకేమన్నావుందా? దాని కన్నా ఇంత వార్నిష్‌తాగి హరీమనడం మేలు.

ఇహ అత్తగారయితేనా? కాకితో కబురుచేస్తే దాని రెక్కలూడగొట్టి వాటిని తనే కట్టుకుని ఎగిరొస్తుంది. సుజాత ప్రాణానికి ఎంతో హాయిగా వుంటుంది. సక్కుబాయి కథలాటి కథ పుట్టదు. గుమ్మంలో దిగగానే "బాత్ రూములో నీళ్ళున్నాయి వెళ్ళి కాళ్ళు కడుక్కోమ్మా" అన్చెప్పేసి మంచంమీ దెక్కేస్తే మళ్ళీ ఆవిడ తిరిగెళ్ళేదాకా లేవనక్కర్లేదు. కమ్మనికాఫీ రోజుకు నాల్గుసార్లయినా తాగొచ్చు; (అసలీవిడ కాఫీవల్లే మామగారు తన పిత్రార్జితం ఆరెకరాల్నీ నాల్గెక రాలకు కుదించగలిగారని ఊరంతా పొగుడుతారు కూడాను.) మనుగుడుపుల మర్యాదలు పొందచ్చు. ఇన్నాళ్ళూ సుజాతకు అడపాదడపా చేసిపెడ్తూండేఇంటిచాకిరీ కూడా తప్పిపోతుంది. కాస్త బజారు పని చూసిపెడితే అబ్బునాథంకూడా ఓ కొత్తమంచం చేయించుకు పడుకో వచ్చు – తనకు నెలతప్పడమనేది లేక పోయినా. అదంతా బాగానే ఉంటుంది గానీ... ఈవిడొచ్చినా కొన్ని ఇబ్బందు లున్నాయి. అన్నం వాల్‌పోస్టర్లంటించు కునేందుకు వీలుగా వండుతుంది. అబ్బు నాథానికి అవసరమైతే జేబులో పోసుకు పోయేపద్ధతిలో వుండాలి. ఇది మొదటి ఇబ్బంది.

ఆవిడకిష్టదైవం డాక్టరు. ఎప్పుడూ "గుండెదడ, ఆయాసం, దగ్గు, నీరసం" అనే మంత్రోచ్చారణచేస్తూ రెండ్రోజు లకోసారైనా దైవదర్శనం చేసుకుని, ప్రసాదాల్ని ఇంజెక్షన్లూ, టానిక్కులూ, బిళ్ళలూ మొదలైన రూపాలతో తీసుకుం టుంది. "మాకుచాకిరీచేస్తూ మీడబ్బుతో మీ రోగం కుదుర్చుకోండి" అంటే బాగుండదు. ఇది రెండో ఇబ్బంది.

వారానికి కనీసం రెండుసినిమాలన్నా చూపించాలి. పాటల పుస్తకాలు కొని పెట్టాలి. ఆవిడ వాటిని ఇంటికి పట్టు కొచ్చి అందులో పాటలన్నిటికీ మంగళ హారతి వరసలు కుదిర్చి పాడుతుంది. ఇది మూడో ఇబ్బందీ, మరియు చిరాకు.

ఎక్కడనేర్చుకుందో ఏంఖర్మో రెండు మూడు డజన్ల ఇంగ్లీషుమాటలు నేర్చు కుంది. అబ్బునాథం ఎప్పుడైనా అత్తా రింటికెళ్తే అతనికోసం ఆవిడ పెట్టెలో దాచిన వెండిసామానులూ, కడుపులో దాచుకున్న ఇంగ్లీషుమాటలూ బయ టకు తీస్తుంది. ఆవిడిక్కడికొచ్చినా రెండో సరుకును బయటకు లాగక మానదు గదా? ఇది నాల్గవ ఇబ్బందీ మరియు చిరాకు, అసహ్యము.

అన్నివిషయాలూ తనకు తెలిసినట్టు మాట్లాడుతుంది. పైగా దబాయిస్తుంది. సవాలక్ష విషయాల్నిగురించి ప్రశ్ని స్తుంది, సలహాలు పడేస్తుంది. ఆచరించ మంటుంది, ఎప్పుడూ వాగుతూనే ఉం టుంది. దీన్ని భరించడమంత కష్టం అదేగాని మరోటిలేదు,

ఆ కష్టంపడేదానికన్నా పిండిమరలో పనిచెయ్యడం మేలు.

ఇంతకీ పిలిపించవలసింది అమ్మనా? అత్తనా?

వార్నిషా? పిండిమరా?

గభాల్న మంచిఆలోచన తట్టింది. జేబులోంచి మూడుపైసలబిళ్ళ తీసి 'అమ్మయితే బొమ్మ-అత్తయితే బొరుసు' అని తలుచుకుని, కళ్ళకద్దుకుని ఎగరే శాడు.

బొరుసే "అత్తా?! మేదనికూడా?" అంటూ బ్యారుమన్నాడు. ఛఛ అనుకుని మరో అర్ధరూపాయి బిళ్ళతీసి పైమాదిరి గానే అనుకుని ఎగరేశాడు. బొమ్మ పడింది. "అమ్మా?! చీవాట్లా? అం దులో సుజాతముందా?" అంటూ వణికి పోయాడు. వీటిల్లో దేన్ని నమ్మాలి? దేనికి బరువెక్కువ?

గబగబా ఓ కట్టెలడితీకిపోయి కాటాలోవేసి తూచాడు.

మూడుపైసలు వేసినవైపు నేలకంటు కుంది.

"వాళ్ళి! అత్తేనా?" అని ఆశ్చర్య పోతుండగా, అదితీవాడి కొడుకు ప చెల్లవాడు అక్కడికి పాక్కుంటూవచ్చి "అత్తా! అత్తా!" అంటూ బోసినవ్వులు కురిపించాడు—కాటూ కరెక్టే అన్నట్టుగా.

అంతే! "నాకు అత్తేకావాలి", "నాకు అత్తేకావాలి" అంటూ పోస్టాఫీసుకు పరిగెత్తి, శుభవార్త మహాసిగ్గుపడుతూ గుండ్రంగా రాసేసి, అత్తగార్ని తక్షణం పంపించమని వేడుకుంటూ మామగారి పేర ఒక ఉత్తరం రాశాడు. ఆ చేత్తోనే అమ్మకు శుభవార్తమాత్రం రాసేశాడు.

ఇంటికెళ్ళి సుజాతకీవార్త చెప్పేసరికి బోలెడిదైపోయి "మిమ్మల్ని నాభర్తగా పొందడం నా అదృష్టం; అల్లుడుగా పొందడం మా అమ్మానాన్నల అదృష్టం" అంటూ ప్రేమగా అతని హృదయంపై వాలిపోయింది.

మూడోనాటి ఉదయం మెయిల్లో అత్తగారు రానేవచ్చింది భోషాణమంత ట్రంకు పెట్టెతో.

రిసీవ్ చేసుకోడానికి వెళ్ళిన అబ్బునాధాన్ని చూస్తూనే "టూమచ్ సంతోషమండీ! గుడ్ శుభవార్త రైట్ చేశారు. ఇదిగో... ఇది టేక్‌చేసి ఫ్రంటు (అంటే ముందు) వక బిస్కెట్ మౌత్‌లో పుట్ చేసుకోండి" అంటూ ఓ బేబీ బిస్కెట్ ప్యాకెట్టందివ్వబోయింది. చచ్చే సిగ్గేసిందతనికి "ఉంచండి! తర్వాత తీసుకుంటాను" అంటూ ఊర్కోబెట్టి ఆవిణ్ణి టాక్సీలో వేసుకుని ఇల్లు జేరాడు.

ఇల్లు జేరగానే మంచంమీద పడుకున్న సుజాతను చంకనేసుకుని "నా తల్లే! నా అమ్మడే" అంటూ ముద్దెట్టుకోడం మొదలెట్టిందత్తగారు.

ఈ దృశ్యం వెగటుగా కనిపించి ఆఫీసుకు టైమైపోయిందంటూ పారిపోయాడు అబ్బునాధం.

అనుకున్నట్టే అతని కారోజునుంచీ అన్నప్రాప్తి క్షీణించసాగింది.

అయితేనేం: టిఫిన్లు తినే యోగం పట్టింది బ్రహ్మాండంగా. అందులోనూ [illegible] టిఫిన్లు—ఉదాహరణకి: మొన్నటి అన్నం, నిన్నటి కందిపచ్చడి, ఫిల్టరు తీయగా మిగిలిన కాఫీపొడుమూ కలిపి రుబ్బి, అల్లం పచ్చిమిరపకాయ ముక్క వేసి హాయిరాయిల్లో దోరగా వేయిస్తుంది అత్తగారు. వాటిరుచి...అబ్బ... తినాల్సిందేగాని రాయలేము. అలాగే మరోటి... బారుసబ్బు, టూత్‌పేస్టూ, సన్నిపిండిలో వేసి సలసలకాగే స్ట్రాంగ్ టీ పోసి చిలక్కొట్టి, అందులో అరటి



పెండ్యాల నాగాంజనేయులు

కాయ చక్రాలువేసి షాంపూలో బజ్జీలు వండి, వాటిమీద నైస్‌గా పౌండ్సు పవుడరు చల్లుతుంది. స్వర్గానికి బెత్తెడెడంగా ఉంటుందట.

వారం గడిచింది.

ఆనాటిరాత్రి ఒంటిగంటవేళ తేలుకుట్టినట్టు లేచి కూచుందత్తగారు.

"అల్లుడుసార్! అల్లుడుసార్" అంటూ.

సార్ లేచాడు "ఏమిటండీ?" అంటూ.

"ఎల్లుండినుంచీ శ్రావణమంత్ బిగినింగండీ! మా విమలచేత నోములు క్యాచ్ చేయించాలి. అర్జెంటుగా ఒక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇచ్చొస్తారా?" అంది లాలనగా. "మహాప్రభో! కష్టకాలం" అని మనసులో అనుకుని లుంగీ బిగ్గించి, చొక్కా తిరగేసి తొడుక్కుని, దండెంకట్టిన కర్రూడదీసి కుక్కల్ని తోలుకుంటూ వెళ్ళి పని పూర్తిచేసుకొచ్చాడు తెల్లారి రెగంటలకు. విమలంటే సుజాత చెల్లెలు.

"ఫేస్ వాష్ చేసుకురండి! కాఫీ డ్రింకు చేద్దురుగాని" అందత్తగారు.

డ్రింకు చేస్తుండగా "ఓ ఫైవుశేర్లు శనగలూ, ఫోర్‌శేర్లు మినప్పప్పూ వాంటెడ్ అండీ! ఈవెనింగ్ కొంచెం బ్రింగ్ చేస్తారా?" అనడిగింది.

ఆరోజునుంచే ఖర్చులధికం కాబోతున్నాయని అర్థమైంది అబ్బునాధానికి. అయినా భయపడలేదు. బ్యాంకులో ఏడొందలుదాకా పేరబెట్టే వుంచాడు.

"అలాగే బ్రింగేస్తానులెండి" అంటూ తుర్రుమన్నాడు సుజాత దగ్గరకు.

"ఏమండీ! మా చెల్లెలుకూడా రాబోతోంది. మనకేపనుకార్డు మీదొచ్చే బియ్యం చాలవు. ఎలాగో ఏమిటో నాకర్థం కావడంలేదు" అంది సుజాత.

"ఇందులో అర్థంకావడానికేముందోయ్? అంతగాకపోతే బ్లాకులో కొంటాంగానీ వచ్చేవాళ్ళని రావద్దంటామా? మనగౌరవం పోగొట్టుకుంటామా?" అన్నాడబ్బునాధం చాలా తేలిగ్గా—లోపల కాస్త బాధగావున్నా.

41 "ఏమో! ఏంచేస్తారో మీ ఇష్టం. మోసేవారు మీరుగాని నేనుగాదుగా" అంది సుజాత.

"నువ్వా మోస్తున్నావుగా" అన్నాడు కొంటెగా చూస్తూ.

ఆరాత్రే మామగారిదగ్గర్నుంచి టెలిగ్రాంవచ్చింది. "విమల్ని పంపిస్తున్నాను. ఉదయం మెయిలువేళకు స్టేషనుకువచ్చి తీసికెళ్ళవలసింది" అని.

అక్కణ్ణించీ అతణ్ణి నిద్రపోనీలేదత్తగారు. మెయిలు ఆరుగంటలకయితే మూడుగంటలకే అతణ్ణి బయటికి నెట్టి తలుపేసింది.

మెయిలు సరిగ్గా టైముకే వచ్చేసింది.

విమలకోసం ఒక్కోపెట్టె వెదుకుతున్నాడు.

"అబ్బునాథం! ఇక్కడ! ఇక్కడ" అంటూ ఓ పోతుగొంతు వినబడింది, కొంచెం ముందునుంచి.

అటు చూస్తే ఆ పోతెవరో కాదు, సాక్షాత్తూ కాళ్ళుకడిగి పిల్లనిచ్చినమామగారు! పక్కనే రేగిపోయినజుట్టూ, పీక్కుపోయిన దవడలతో విమల!

ఒక్కసారి షాక్ తగిలినట్లయిందబ్బునాథానికి. అలాగే నిలబడి పోయాడు. మరదల్ని పంపిస్తున్నాననీ వైరిచ్చినవాడు ఈయన కూడా రావడమేం మాయరోగం? అసలే మద్రాసులో వుంటూ రేషన్ బియ్యం మీద బండీ లాక్కొస్తూంటే వీళ్ళందరికీ కుంభమెలా ఏర్పాటు చెయ్యడం? ముందే జాగ్రత్తపడి ఏదన్నా అవాంతరాలొస్తే తట్టుకోవచ్చు గదా అని కీ. శే. తాతయ్య, నాయనమ్మల పేరూ, పుట్టని తమ్ముడు సుబ్బారావు పేరూ రేషను కార్డులో నమోదు చేయించాడు కాబట్టి అత్తగారి దెబ్బ బ్బుందిలేదు. మురదలొస్తుంది అంటే బ్లాకులో కొనచ్చులే అనుకున్నాడు. ఈయనకూడావస్తే ఏమిటుగ్గం? బ్లాకులో ఎన్నిబియ్యమని కొనాలి? ఎలా అఘోరించాలి?

"అలా నిలబడి పోయారేంబావగారూ? కళ్ళు బైర్లు కమ్మేశాయా మా ఇద్దర్నీ చూసి?" అంది విమల.

అబ్బునాథం తేలుకుట్టిన దొంగలాగ బాధ అణిచి పెట్టుకుని మేకపోతులా "ఛ ఛ! ఏమిటే ఆమాటలు? అసలేనేను కళ్ళలో నలుసుపడి అఘోరిస్తుంటేనూ?" అంటూ తప్పుకున్నాడబ్బునాథం — "ఇహ వెళ్దాం పదండి" అంటూ.

పదిగజాలు నడిచారో లేదో "బావా!" అనే కేక వినబడింది, వెనకనుంచి.

ముందు మామగారే వెనక్కి తిరిగి చూశాడు. వారి రెండో పుత్రరత్నం గోపీ! కొయ్యబారిపోయాడు మామగారు.

బండబారి పోయాడబ్బునాథం "నా ఇల్లేమన్నా భారతదేశమా? ఇలా జనాభా పెరిగిపోడానికి?" అనుకుంటూ. విమలమాత్రం ఆశ్చర్యపడి లేచి, "ఇదేమిట్రా? నువ్వెలా వచ్చావురా తమ్ముడూ" అంది కనుబొమ్మ లెగరేస్తూ.

ఒక్క చిరునవ్వు. తండ్రి ముఖం చూసి తలొంచుకున్నాడు గోపి.

ఇంతలో తేరుకోడం వల్ల మంటేసుకొచ్చింది. "అడిగిన మాటకు సమాధానం చెప్పవేరా వెధవా!" అంటూ గద్దరించాడు.

"ఊఁ? ఎలావచ్చానా? కావిడి పెట్టె అడుగున వెండిగిన్నెలో మూటగట్టి పెట్టేరే? అది తీసుకుని, టిక్కెట్టు కొనుక్కొని వచ్చేశాను" అన్నాడు గోపీ.

కప్పని తొక్కినట్టు అదిరిపడ్డాడు మామగారు.

"అయ్యో! శనిగొట్టు వెధవా! మొదటి సారిగా నేను పేకాటలో గెల్చిన లక్ష్మి

WITH BEST COMPLIMENTS

FROM

M/s. BESTO LABORATORIES

7-1-39. AMEERPET
HYDERABAD

రా అదీ. వేంకటేశ్వరస్వామికి ముడుపు కూడా కట్టాను" అంటూ వాపోయాడు.

"నేను నాకోసం వచ్చాననేంటి." పొగడేశాడు గోపి.

"మరి ?"

"నువ్వేమో నెల రోజుల్దాకా తిరిగి రానన్నావాయె. పైగా నీ చీటి పేకక్కడే మర్చిపోయొచ్చావు. పోన్లే ఇద్దాంగా అని వస్తేనూ" ముద్దులు గుడవసాగాడు గోపి.

"అం!" అంటూ అదిరిపడి "అదేమిటే అమ్మాయ్! నీ పెట్టెలో పేకలు వెయ్యమన్నానుగా, మర్చిపోయావా ?" అడిగేశాడు విమల్ని.

విమల తన తెలివి తక్కువ తనానికి చిన్నబుచ్చుకుంది.

"నిన్ను నమ్ముకుంటే కుమ్మూర్దుపెద్ద. ఇంకానయం : దేవుడల్లే తెచ్చాడు. పసి వెధవని అనవసరంగా తిట్టానుకూడాను" అంటూ గోపిగాణ్ణి దగ్గరకు లాక్కుని తల నిమురసాగాడు మామగారు.

"ఎలాగైనా వీడుమనందరిలోకి మహా తెలివైన వెధవ" అంటూ మెచ్చేసుకుంది విమల. ఎక్కడో ఛర్రుమందబ్బునాథానికి! "అందుకేగాబోలు స్కూల్ ఫైనలు రెండుసార్లు చెట్టెక్కించేశాడు" అనుకున్నాడు మనసులో.

"ఇహ వెళ్దాంనాన్నా! బోలెడుపొద్దెక్కింది" అంటూ అందర్నీ బయలుదేరదీసింది విమల. అందరూ ఇంటికిచేరగానే పలకరింతలు, పులకరింతలూ పూర్తికానిచ్చి, సుజాత అబ్బునాథాన్ని వంటింట్లోకి పిల్చింది,

"బియ్యం తెమ్మని చెప్పడానికేగా ?" అన్నాడబ్బునాథం.

"అవేకాదు. కూరగాయలూ, మంచి నూనే, కాఫీ పొడుము. ఇదిగో లిస్టు. ఛాంచేసేలోపల మరో సార్యయినా కాఫీ తాగకపోతే మానాన్న మంచాన పడతాడు. అనక నేనిబ్బంది పడాల్సొస్తుంది" అంది సుజాత.

"సరే. కానీ!... డబ్బూ, సంచీ ఇలా పారెయ్యి."

సంచీ పారేస్తానుగానీ, డబ్బు బ్యాంకు వాళ్ళచేత పారేయించకోండి." అంటూ సంచి ఇచ్చి విమల దగ్గర కెళ్ళిపోయింది.

ఆ రోజు ఖర్చు తడిసి ముప్పందుమయింది అబ్బునాథానికి...

కాస్త భయమేసినా మళ్ళీ తట్టుకున్నాడు.

ఆ మర్నాటినుంచీ పాలకొలత పెరిగిపోయింది. పొద్దునా సాయంత్రమూ కూడా ఓ గేదొచ్చి ఇంటి ముందర నిలబడుతోంది. కాఫీలూ, వంటలూ, పిండి వంటలూ చిన్న హోటలు సైజుకి పెరిగి పోయాయి. సినిమాలు తెగకంటు పడ్తున్నాయి. నోములూ, పేరంటాళ్ళూ నానేసిన శనగలూ, అరటిపళ్ళూ ఇల్లంతా నిండాయి. మామగారూ చుట్టుపక్కల నలుగురు మనుషుల్ని పోగేసి చతుర్ముఖ పురాణ పారాయణం చెయ్యడం మొదలెట్టాడు రోజూ. గోపిగాడు గుడ్డలు తెచ్చుకోని కారణంవల్ల అబ్బునాథం గుడ్డలు వాడేసుకుంటున్నాడు. రెండు లుంగీలూ, తుళ్ళూమామగారి పరమయ్యాయి. అదీగాకుండా—



విమల అత్తవారి వైపు చుట్టాలు నాలుగిళ్ళ వాళ్ళు ఆ వూళ్ళోనే ఉన్నారుట. విమల వచ్చిన వార్త తెలియగానే ఒక్కొక్కళ్ళూ రాసాగారు. అక్కణ్ణించీ ఇక్కడి వాళ్ళక్కడికీ వెళ్ళసాగారు.

అక్కడ కాఫీతాగి ఇక్కడ టిఫీను పెడుతున్నారు. అక్కడ టిఫినయితే ఇక్కడ భోజనం — అక్కడ భోజనమయితే ఇక్కడ సంతర్పణ — అక్కడ చిన్నాళ్ళ స్నానం — ఇక్కడ తలంట్లు — ఆఖరికి అక్కడ్డ గడ్డం గీయించుకుంటే ఇక్కడ క్షౌరం చేయించే స్థితికి వచ్చేశారు.

బ్యాంకులో డబ్బు టజార్న్ పడిపోతోంది రోజురోజూ! అయినా అబ్బునాథం ధైర్యంగా ఉంటున్నాడు బయటికి.

అత్తగారికి వ్యాధిఎక్కువైనా తన మర్యాద దక్కించుకుంటూ (పడక వెట్టకుండానే) అల్లుడికి గౌరవ ప్రతిష్టలర్జించి పెడుతున్నాననుకుంటోంది.

పదిరోజులు గడిచాక అబ్బునాథం పెద్ద బావమరిది రమేశం భార్యతో సహా వచ్చేశాడు.

ఎందుకుటా ?

సుగుణకి కడుపులో ఎడతెగని మంటలు! తిండి సయించడం లేదట. కాఫీ తాగటం లేదట. చాకిరీ చేసుకోలేక పోతోందట... నిద్రపట్టడం లేదట. ఇక్కడ డాక్టరుకు చూపించుకోవాలని వచ్చిందది. అబ్బునాథమే డాక్టరు దగ్గరికి తీసికెళ్ళాడు. భర్తకాబట్టి పరమేశం కూడా వచ్చాడన్నమాట.

అబ్బునాథం ఇప్పటికీ బాధపడలేదుబయటికి. కానీ...

ఆ మర్నాటి రాత్రి ఆఫీసుపనితో సతమతమయి పదిగంటల వేళ అవు రావురుమంటూ ఇంటికొస్తే సుజాత అతణ్ణి వీధిలోకి లాక్కెళ్ళి "ఏమండీ! ఇహ మన బతుకు బజారు పాలయ్యేట్టుంది. వీళ్ళందర్నీ ఎలాగో అలాగు వూరుపంపించెయ్యాలండీ! నాకిప్పుడు కులాసాగానే ఉంది. నా చాకిరీనేను చేసుకోగలను" అని మొదలెట్టింది!

"అదేమిటోయ్! సరికొత్త బాణీ డైలాగు మాట్లాడుతున్నావ్ ?" అన్నాడు హేళనగా.

"డైలాగూ కాదు. నా బొందాకాదు. మీకిపూట అన్నం మిగల్లేదు — మా చెల్లెలు తాలూకు చుట్టాలొస్తే మా అమ్మ సంతర్పణ చేసేసింది" అంది సుజాత కాస్త విసుగ్గా.

"సర్లే మళ్ళీ వండితే సరిపోలా ?" అన్నాడు తేల్గ్గా.

"వంటా ? బాగానేవుంది. అక్షింతలు కలపడానిక్కూడా మిగల్లేదు" అంది బాధగా.

అబ్బునాథం బాధ పడిందక్కడే.

ఇంత సంపాదించుకుంటూ, ఇంత మందిని ఓపికతో మేపుతుంటే చివరకు వస్తుండ వలసిన రోజులు కూడా దాపురించాయి.

కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి అయినా తమాయించుకున్నాడు.

ఇంటికొచ్చిన వాళ్ళకి తిండి పెట్టలేక పోయాడనే అపవాదొస్తుందేమోనని భయపడి బాధను లోపలే దాచేసుకున్నాడు.

“సరే! ఓ రూపాయుంటే ఇయ్యి. అలా వెళ్ళి ఏదన్నా తినొస్తాను” అన్నాడు! సుజాత తెచ్చిచ్చింది. అటినించటే వెళ్ళి పోయాడు. సుజాత కన్నీళ్ళు తుడుచుకుంది.

టిఫెను తిన బుద్ధి పుట్టలా! పిచ్చివాడిలాగ రోడ్ల వెంట తిరగడం మొదలెట్టాడు ఏమిటేమిటో ఆలోచిస్తూ — ఊహిస్తూ.

సుజాతకు ఒంట్లో బాగాలేదని అత్తగార్ని పిలిపిస్తే, ఆవిడటానిక్కుల మీద బతికేమనిషయింది. విమల్ని పిలిపించబోతే మామగారూ, గోపీకూడా తయారు. మళ్ళీ ఇప్పుడో రోగిష్టి మనిషి వచ్చింది. ఇహ తనకూ కూడా రోగం వస్తుందేమోననిపిస్తోంది అబ్బునాధానికి — కూడు కూడా కరువవడం వల్లా.. మనస్సి మితం కోల్పోతూండడం వల్లాను...

మిత్రుడు పీతాంబరం తారసిల్లాడు రోడ్డు మీద. అబ్బునాధం పాదాల వంక చూసి, “అదేమి బ్రదర్! తుక్కయిపోయిన చెప్పులా నువ్వు తొడుక్కునేది?” అన్నాడు.

“వచ్చేనెల్లో కొత్తజతకొనాలి బ్రదర్” అన్నాడు మామూలుగా.

“అందాకా ఎందుకు బ్రదర్! ఒక్క నాలుగు రూపాయలు నీవికాదనుకుంటే కొత్తచెప్పులజత కుట్టిస్తాను నా చర్మంతో. కృతజ్ఞతతో. జీవితాంతం నీ పాదాలకింద పడుంటాయి. ఏమంటావు మరి?...

“.........” అబ్బునాధం వింతగా చూశాడతని వంక.

“ఒకటో సారి”

“.........”

“రెండోసారి”

“ఉండునాయనా! ఇంతకీ నీకిష్టమేమిటో చెప్పు?”

“ఏం లేదోయ్! మా యావిడ నన్ను అయిదోసారి తండ్రిని చెయ్యబోతోంది. ఒంట్లో బాగుండలేదు. డాక్టరు మందు బుడ్డి రాసిచ్చాడు. నా దగ్గర రూపాయి వుంది. గోవిందరావు దగ్గరమూడు రూపాయలు పుచ్చుకున్నాను. నువ్వు కూడా అడిగింది ఇచ్చేస్తే ఎనిమిది రూపాయ లవుతాయి. మందు బుడ్డి ఏడున్నర. మిగిలిన అర్ధరూపాయలో రెండు రొట్టి ముక్కలూ, ఓ సింగిల్ “టీ” రెండు చార్మినార్ సిగరెట్లూ సర్దుకుంటాను” అన్నాడు గడగడా.

అబ్బునాధానికేదో ఆలోచన తట్టింది.

“ఒక్క విషయం నాకు ప్రామిస్ చే... నీ కష్టాలుగట్టెక్కిస్తాను” అన్నాడు. గళాన్ని అతని చేతిలో పీతాంబరం ఒత్తేసి, అరిచెయ్యి గిల్లాడు.

“చెప్పుమరి” అంటూ,

“నీ భార్యాపిల్లల్ని వెంటనే మీ అత్తారింటికి పంపేయ్! ఏమంటావు? త్వరగా చెప్పు... అర్జెంటు!” అంటూ గుర్రాల్నితోల్టం మొదలెట్టాడబ్బునాధం.

“అమ్మబాబోయ్! కూటికి గడ్డికరవాలి బ్రదర్” అంటూ మొత్తుకున్నాడు పీతాంబరం.

“గడ్డి కరవడమేం రోగం? ఊళ్ళో హోటళ్ళన్నీ మూసేశారా? బ్రహ్మాండమైన సాంబారు రసాలతో వేరుశనగ పప్పులంత ఉండే అన్నంమెతుకులు పెడుతున్నారు.”

“అదికాదు బ్రదర్!...”

“ఇహనే వెళ్తున్నా” అబ్బునాధం బయల్దేరాడు.

“సరేకానీ” అంటూ చెయ్యి జాపాడు పీతాంబరం.

“ఈ చేతి నీ రేపు పదిగంటలదాకా వ్రేలాడేసి అట్టేపెట్టు. బ్యాంకు దగ్గర చాపవచ్చు” అన్నాడబ్బునాధం.

“అలాగే! వస్తాను” అంటూ వెనక్కి తిరిగాడు పీతాంబరం.

చొక్కాపట్టుకు లాగా డబ్బునాధం.

“ఇంకా ఏమిటి బ్రదర్?”

“నీరేషను కార్డు నాదగ్గర కొన్నాళ్ళుంచుకోనీ!”

“సర్లే బ్రదర్” అంటూ బరువుగా వెళ్ళిపోయాడుపీతాంబరం.

♦ ♦ ♦

బ్లాకులోకొన్నా, రేషనుకార్డు మీదతెచ్చినా తనకు అప్పుడప్పుడూ తిండికికొరతకల్గడంతప్పలేదబ్బునాధానికి అతనికి కడుపులో మంటలు ఆరంభించాయి.

వారం తిరక్కుండా పులిమీద పుట్టలా అమ్మదగ్గర్నుంచి ఉత్తరం!.

ఆవిడకు బ్లడ్ ప్రెషర్ ఎక్కువయిందట. అరిచేతులూ, అరికాళ్ళూ చురుకు చురుకు పోట్లుట. నీరసం, దడ, హెచ్చిపోయాయట. మద్రాసువచ్చి మంచి ఆయుర్వేదం డాక్టరుదగ్గర పరీక్ష చేయించుకుని మందు తినాలిట. అబ్బునాధం వెంటనే వచ్చి ఆవిణ్ణి తీసుకెళ్ళాలట! మంచం మీద నుంచి లేవడం కూడా కష్టంగా వుండడం వల్ల ఇలారాయాల్సి వచ్చిందట. అదీ ఉత్తరంలోని సారాంశం. తన ప్రాణానికి మరో రోగి!

సుజాత రికమెండేషను మొదలెట్టింది అత్తగార్ని తీసుకురమ్మని.

అత్తగారూ అదే మాటంది.

తప్పింది కాదు. ఆ రాత్రే బయల్దేరి ఊరెళ్ళిపోయాడు.

అమ్మ నిజంగానే బాధపడ్తోంది.

“వెంటనే వెళ్దాం పదమ్మా” అంటే మంచిరోజు కాదందావిడ.

మూడు రోజుల తర్వాత మంచి రోజువచ్చిందిట.

ఇద్దరూ మద్రాసుప్యాసెంజరెక్కారు.

మర్నాడు సాయంత్రం అయిదు గంట

[illegible] ఇల్లు చేరారు. అయితే ఇల్లు తాళమేసి ఉంది. అమ్మ నిలబడలేకుండా వుంది. కూర్చోబెడదామంటే చోటులేదు. ఆవిడ గోడకానుకుని కళ్ళు మూసుక్కూర్చుంది.

ఇంట్లో వాళ్ళందరి మీదా కోపమొచ్చింది.

పేరుపేరునా తిట్టుకున్నాడు మనసులో.

దిక్కులు చూడసాగాడు.

'పోస్ట్' అంటూ ఓ కవరు విసిరి పోయాడు పోస్టుమాన్. విప్పి చదివాడు.

'బ్ర॥ శ్రీ॥ వే॥ అబ్బునాథం అన్నగారికి! సుగుణ నమస్కరించి వ్రాయునది. మీరీపాటికి మీ అమ్మగార్ని తీసుకొచ్చే ఉంటారని భావిస్తాను. నేనూ మీబావగారూ అక్కడికొచ్చి కొన్నాళ్ళు తిష్టవేసి మీ కప్పుడప్పుడూ పస్తులు ఏర్పాటు చెయ్యవలసి వచ్చినందుకు చింతిస్తున్నాను. మన్నించండి.

మీకూ, నాకూ కూడా మేలు జరిగే నిమిత్తం అలా చెయ్యకతప్పలేదు. నన్ను లంకంత కొంపలో పడేసి, ఇంటెడు చాకిరీ నా నెత్తినేసి పోతే నాకెంత బాధగా వుంటుంది చెప్పండి–

అలాగే వీళ్ళంతా మీ యింటికొచ్చి మిమ్మల్ని చెదపురుగుల్లా తినేస్తుంటే మీ కెంత బాధగా వుంటుంది?

అందుకని ఉభయ తారకంగా ఉండేట్లుగా పథకం ఆలోచించి మద్రాసు వచ్చాము నేనూ – మీ బావగారూను.

నాకు కడుపులో మంటలన్నానే? అవి అత్తా మామల మీదన్న మాట. అంతేగాని నాకు రోగమేం లేదు. మీ లేడీ డాక్టరుగారి సాయంతో మన వాళ్ళందర్నీ ఇక్కడికి దొర్లించుకొచ్చేశాను.

ఎలాగంటారు! మీరు వెళ్ళేప్పుడు అత్తగారికి దగ్గూ, ఆయాసం అధికంగా ఉన్నాయి గుర్తుందా?... దాని ఆధారంతో అత్తగారు తక్షణం వూరిగాలి, ఆ వూరినీళ్లూ వెంటనే వదిలి మారంగా వెళ్ళకపోతే క్షయవస్తుందని, డాక్టరుగారితో సలహా ఇప్పించాను. అంతే! వెంటనే అత్తగారే అందర్నీ ప్రయాణాలు చేయించింది. ఈ విషయం మనసులో పెట్టుకోండి. మరెవ్వరికీ తెలియనీకండి! ఉత్తరం చించెయ్యండి. వీలయితేతగలబెట్టండి.

మీ అమ్మగారికి శ్రద్ధగా మంచి వైద్యం చేయించండి. ఆమె కోలుకుంటే మీ కిలాటి బాధలెప్పుడూ రావు. ముఖ్యంగా మీరు పస్తుపడుకోవలసిన అగత్యం ఎప్పుడూ వుండదు. తిట్టినా పెట్టినా అమ్మకు మించిందింకేముంటుంది? మీ అందరి యోగక్షేమాలు తరచు తెలియజెయ్యండి.

ఇలా

మీ చెల్లెలు సుగుణ.

ఇంతవరకూ చదివిన అబ్బునాథం ఆశ్చర్యంలో పడ్డాడు.

'అరె! సుగుణా, రమేశం వెళ్ళిపోయారా?' అని మళ్ళీ చదవసాగాడు ఆత్రంగా.

అబ్బునాథం ఉత్తరంలోని చివరి మూడు వాక్యాలు మరోసారి చదువుకున్నాడు, జీర్ణించుకున్నాడు. ఊహాలోకాల్లోకి పోయాడు.


అమ్మ, సుగుణ దేవతలనిపించారు.

నిజంగా సుగుణ అప్పటికి దేవతే!

అమ్మ ఎప్పటికీ దేవతే!. రెండు కన్నీటి చుక్కలు రాలాయి.

'అదేమిటండీ! ఎప్పుడొచ్చారూ?' అంటూ కూరల సంచితో వస్తున్న సుజాత పలకరింపుతో, కళ్ళు తుడుచుకుని మళ్ళీ ఈ లోకంలో పడ్డాడు అబ్బునాథం

□□□




ఉత్తమ కథానికా సముచిత
జ్యోతి దీపావళీ సంచిక
సహృదయ సహస్రానీక వాంఛిత
మృదుమధుర స్వరవిపంచిక